# ఎండమావులు

క్రూరచరణములు గలిగియుండియు
కరహీనునిచే జలచరుడు
పట్టుబడెనని శిరహీనుడు
చూచి నవ్వె చిత్రముగానూ.

ఎవ్వరదీ ? ఓహో నీవా అబ్బాయి ? ఏం కథ, దారితప్పివచ్చేవు? ఇతనెవ్వరూ నీ కూడా ?

.... .... ....

అల్లాగా, క్రొత్త అల్లుడన్నమాట మన ఊరికి, మరి బండేదీ ?

.... .... ....

అయ్యో పాపం. ఎల్లా బెనికిందో దాని కాలు, నోరులేని జీవి. మరి రెండో ఎద్దు కోసం ఊళ్లోకి పంపించారా ? ముందర ఇల్లా లోపలికి రండి. ఎండ. కూచోండి. ఇదిగో అమ్మాయీ, ఆదిలక్ష్మీ, ఆ చాప ఇల్లా వెయ్యి.

.... .... ....

సరి, సరి, ఈ లోపుగా నారాగాలు విని పించినాయి ? వాటికేం గాని, ఏదో పాత కాలపు చాటువు. కప్ప, పాము, పీతల, స్వీయ చరిత్రలనుకుందాం. అసలామాటకొస్తే ఎప్పుడు ఏది చెవినిబడ్డా, అది అప్రయత్నంగా నోటికి వస్తూనే ఉంటుంది. అదొక పిచ్చి నాకు. అసలు, చిన్నతనంలో మా తండ్రి గారిని ఎదిరించి, ఇల్లు వదిలిపెట్టి, చక్కా రావడానికి కూడా, ఈ నాటకాల సరదాయే కారణం.

అబ్బబ్బ ! పిల్లలూ, అల్లరిచెయ్యకండ్రా. వీళ్లకి ఎండా లేదు వానాలేదు.

. . . . . . . . .

నిమ్మళంగా అంటారేం ? మండిపోతూంటే ఎండలు. కాస్త మజ్జిగ పుచ్చుకుంటారా ?

. . . . . . . . . –

అమ్మాయిలూ, ఏమిటా పొలికేకలు ? అసలు వీళ్ల అల్లరివల్లనే నిద్రలేచేసేను. ఓయ్ ఓయ్ అని అరవడం – ఈ సత్రం మారుమోగు తుందిగదూ, ఆ ప్రతిధ్వని విని అమ్మోయ్ దయ్యం అని పారిపోవడ మూను, మళ్లా రావడం. మళ్లా అదే వరస మరీ ఆవిగ్రహం ఒకటి. ఆకారం కాస్త తప్పిందా, కొయ్యదాయె, పోయిన సంవత్సరం వరదలకి, నాకు వళ్ళు బాగాలేక ఆస్పత్రిలో వున్నాను. విగ్రహం నీళ్ళల్లో మునిగి ఉండిపోయి ముక్కు మొఖం చివికి చితికిపోయాయ్ ఆ ఆకారం చూచి మరీ భయపడతారు ఈ చిన్నవాళ్లు. అల్లరికేం చూడండి, ఆ పడుకున్న దానిని ఎల్లా లేపేస్తున్నారో. పాపం అది పెద్దదయిపోయిందా, నిద్ర పోనియ్యండి. ఇల్లా వచ్చి మీరు కూడా, అల్లరి చెయ్యకుండా కూచోండి.

. . . . . . . . . ?

ఈ ప్రక్క ఊరుపిల్లలే. రాళ్ళపాలెం వాళ్లు.

. . . . . . . . . !

అదీ వరస, చూశారా ? వీళ్ళకి 'చాత్రం' చెప్పాలట నేను. అపున్నా మీకు కథలు చెప్పడం తప్ప నాకు పనేముంది.

... ... ... ... ...

మాంచివాడవే, నీవూ కలిశావూ వాళ్ళతో. చదువుకుంటున్న వాడవు. నువ్వు చెప్పు ఏదైనా కథ. నేను వింటాను. అదిగో మీ బావగారు నవ్వుతున్నారు కూడాను.

... ... ... ... ... ...

బాగుందయ్యా వరస ! ఇహను నీవు కూడా చెప్పమంటే, మానేదెల్లా నేను. సరే. అల్లాగైతే వినండి. నీ వీ ప్రాంతాలకి క్రొత్తాయిరి. ఇక్కడ మంచీ చెడ్డా చెబుతాను.

నాకూ కొంచం కాలక్షేపంగా ఉంటుంది. ముందరి రోజుల్లో అంటే, ఈ సత్రం వచ్చేవాళ్ళతో పోయేవాళ్ళతో నిండుగా వుండేది. ఇప్పుడు చంద్రాయి కాలువ ప్రక్కనించీ రహదారి బడ్డది. ఊళ్ళో కుర్రాళ్లందరికీ సైకిళ్లు సైకిల్ రిక్షాలు గ్రామాల్లోకి వచ్చేస్తున్నాయి. ఆరోజుల్లో ప్రయాణం అంటే, అదొకపని. రెండెడ్ల బండి కట్టాలి, లేదా కాలినడక. ఇప్పుడు ఏదో పెద్దతనంగా మీ నాన్నగారు బస్తీ స్టేషనుకి రెండెడ్ల బండి పంపేరు గాని, ఈ రోజుల్లో ఎవ్వరు వాడుతున్నారు, ఈ బండ్లు సాధారణంగా.

ఈ ప్రాంతంఅంతా, కనుచూపుమేర, ఎక్కడా చెట్టూ చేమా ఉండేదికాదుగదూ. కాలువలు కట్టేసేవారా, ఈ చెరువులూ, బావులూ తదుపరి పుట్టుకొచ్చినాయి గాని, దేశం ఎండిపోయి ఉండేది. చైత్ర వైశాఖాల్లో నిప్పులు కురిసేవంటే నమ్మండి. మంచినీళ్లు కుండేటి కొమ్ము ఈ చుట్టుపట్ల. వాడుకునేందుకు, పశువులు త్రాగడానికీ, ఒక్క బురదగుంట. రాత్రుళ్ళంతా, నేలబీటల్లోనించీ — అసలే నల్లరేవడేమో — గాలులు నిప్పులు చిమ్ముకుంటూ వచ్చేవి. దివారాత్రులూ, తడిగుడ్డలు మీద వేసుకుంటూ జనం కాలక్షేపం చేసేవారు. మంచినీళ్ళకి రెండు మైళ్ళు, చంద్రాయపాలెం నూతివి. అసలా వడగాల్పులు తల్చుకుంటే ఈవేళ ఎండ దిగతుడుపు, అబ్బాయి.

ఆ. ఆ, మీఇళ్ళు బంగారంగాను. కథ మొదలెడుతున్నాను ఇహను.

సరి, ఆవూరి షావుకారుగారి పేరు రథాంగపాణీ. ఈ రామగిరి పాడు బస్తీకాపురం. పరమలోభి. ఉండడానికి మాత్రం ఒక లోగిలి. ఏం లాభం, సుఖంగా బ్రతికి ఎరగడు గదా. వడ్డీవ్యాపారం, మహ కొరకరాని కొయ్య. ఫాలాక్షుడొచ్చి చెప్పినా, వడ్డీలో ఒక చిల్లిగవ్వ అయినా వదలడు. పిల్లాజెల్లా పస్తులు పడి అయినా వడ్డీలు చెల్లించాల్సిందే. దయాదాక్షిణ్యాలు, దానధర్మాలు, ఊఁ హూ, లేనేలేవు. ఓసారి చలమయ్య వీథిభాగవతం కట్టించి చందా అడిగితే, 'ఏ పద్దులో వ్రాసి ఇమ్మన్నావయ్యా' అన్నాడుట. ఇవ్వనేలేదు సుమా ఆఖరుకి. రానురాను, ఈ చుట్టుపట్ల బీదాసాదాకి మనిషి సింహస్వప్నంగా తయారయాడు.

నేనాయన గుమస్తాని ఆరోజుల్లో. నేనీ వూరు వచ్చిన కొత్తలో నాటకాలు నా జీవనోపాధి. నేటికి వుండవచ్చు, రేపు వుండకపోవచ్చునని నాకు ఆయన నచ్చచెప్పారు .... నీవాఖండువాతో ఏం విసురుకుంటావుగాని, విసనకర్ర తెచ్చి ఇస్తానుండు .... మా రోజుల్లో ఈ ప్రాంత మంతా, ఎంత దౌర్భాగ్యంగా వుండేదంటే, ఇంత పరమ కఠినుడూ రథాంగపాణిగారే ఓనాడు జాలిపడిపోయారు ఒహ సందర్భంలో. పొలంలోకి వెళ్ళాం, ఆయనా నేను ఓనాడు. కళ్ళముందు ఒక గిత్త వీపుమీద జోరీగల్ని తోకతో కొట్టుకుంటోంది. అవి పోవు ఓపట్టాన. ఆ దూడ అటూ ఇటూ పిచ్చిపట్టినట్లు పరిగెడుతూంది. "ఎక్కడైనా ఒక్కచెట్టు మొద్దయినా ఆఖరుకి ఒక్కరాయి అయినాలేదు. చూచారూ, సుబ్బప్పగారూ, దానికి వీపు అది రాచుకోడానికి చెయ్యాలేదు, నోరూ లేదు" అన్నారు రథాంగపాణిగారు.

అల్లాఅంటే జ్ఞాపకం వచ్చింది. వెర్రిగంగి ఈ వూరు వచ్చింది కూడాను. దానికి వెర్రీ గిర్రీ ఏమీలేదు సుమాండి. ఎల్లావచ్చిందో ఆ

పేరు మాత్రం వచ్చింది దానికి. ఆరుమైళ్ళ అవతల వున్న పల్లి, దానిది. తల్లీ తండ్రీ పోయారుట. బ్రతుకుదెరువు లేకపోయింది. దానికి రెండు చేతులూ లేవు. భుజాల తరువాత జానెడుమేర, మొండి కొయ్యలాగుండేవి చేతులు. అంతే. భుజానికి ఒకజోలి తగిలించి ఉండేది. అందులో ఒక గంటి కూడా వుండేది, అది భోంచెయ్యడానికి. భిక్షానికి వచ్చింది. "ఉప్పుతంబమూలోనూ ఉద్భావించినవాడా" అని పాడడం మొదలెట్టింది. అంటే ఉక్కుస్తంభమూలోనూ ఉద్భవించిన వాడా, అన్నమాటయ్యా . . .

"పుట్టుకతోనే వచ్చిందా, మధ్య కలిగిందా ఈ అనర్థకం ?" అన్నారు రథాంగపాణిగారు.

"పుట్టినప్పుటేలనించీ ఇంతేనుండి నేను" అంది గంగి. "అసలు బాబయ్యగారూ, ఇది మా అయ్యనించే నంటుంది. మా అయ్య చద్దన్నం మూట్లూ గట్టా గద్దలెత్తుకుపోయేయంట. ఒకనాడు దుబ్బు పక్కంగా ఒక గద్ద కూచోని వుంటే, మా అయ్య ఎనికపీటుగా యెల్లి, దాన్ని పొట్టుకొని, రెక్కలెనక్కిరిసేసాడంటుంది. మాయమ్మ దెబ్బలాడిం దంటకూడా, మాయయ్య ఇనలే . . . అప్పుడు నేను మాయమ్మ కడుపుల నుండానుంట. అప్పుటాలనుంచీ, గిట్టా పుట్టుకొచ్చానంటుంది" అంది.

"మరి నీ బ్రతు కెల్లాగే ?" అంది రథాంగపాణిగారి భార్య శేషమ్మగారు.

"మారాజులు ధర్మం చేత్తానే వుండారుండి. మాలాగా గడవ నోళ్ళకి గాపనీ, గీపనీ కాత్త చేత్తాను. అయమ్మా ఈయమ్మా తలకాయ గట్టా దువ్వి ముడేత్తారు."

"నీ వల్ల జరిగే పనులేముంటాయి, పాపం ?" అంది ఆవిడ.

"అదేం ? కాల్లున్నాయిగందా" అంది గంగి.

ఇహ చేసి చూపింది, అబ్బాయిలూ — మీరు నమ్మలేరు. కాలి వేళ్ళతో బియ్యం చెరిగి ఏరుగుచేసింది. ఏవి చాకచక్యమని ! ఏం చురుకుతనం ! కాళ్ళ వేళ్ళమధ్య ఒక పుల్ల పుచ్చుకుని, మనం చేతులతో చేసే పనులన్నీ చేసేది. అందరం నిశ్చేష్టితులమైపోయాం.

ఇహను నాటినించీ, శేషమ్మగారు ఒకపూట దానికి భోజనం పెడుతూండేవారు. వాళ్ళ వీధి అరుగు దాని మకాం. సాయంత్రం ప్రక్క పల్లెలికీ, బస్తీలో తెలిసిన ఇండ్లకీ, అక్షయపాత్రకి వెళ్ళడం తప్ప దానికి వేరే పనిలేదు.

శేషమ్మగారు పూర్వకాలపు ఇల్లాలాయె. మంచన్నా చెడ్డన్నా ప్రపంచంలో ఆయనే—అనేవారు. ఈయనికి వేపకాయంత వెర్రికూడా వుందని నిశ్చయించారు, ఇరుగూ పొరుగూ. అసలు చలమయ్యకి కోపతాపాలు పుట్టుకురావడానికి, ఈ పిచ్చి ధర్మం కూడా ఒక బలీయమైన కారణమై ఊరుకుంది. చుట్టుపట్లవున్న మనలాటివాళ్ళ నోళ్ళు కొట్టి, ఏ వూరుదో, ఆ మొండి దానికి ధర్మం చేస్తావున్నాడయ్యా" అన్నాడు చలమయ్య, నలుగురులోనూ, ఓనాడు.

ఆ మాటకొస్తే, చలమయ్య మట్టుకు ఘనుడా ఏమిటి ? అతనూ ఉన్నదాంట్లో వడ్డీవ్యాపారం చేసి కొద్దో గొప్పో సంపాదించాడు స్వగ్రామంలో. ఏం లాభం ? జూదం వగైరా వ్యసనాలు నేర్చాడు. వచ్చింది కాస్తా అయిపోతూండేది. కులవృత్తి వడ్రంగం చేసినా తద్వారా వచ్చిన తృణమో పణమో, అతని ఖర్చుకే వచ్చేదిగాదు. ఏదో అతని అన్నగారు పెద్దతలగా కాపాడేవాడు కుటుంబాన్ని. గ్రామంలో నాటకాలు నేర్పడం, వేషాలు వేయించడం సరదా అతనికి. కర్రసామూ

అదీ తెలుసులెండి. తాళింఖానా వొకటి యేర్పాటు చేశాడు. కసరత్తు, కుస్తీలు కుర్రవాళ్ళకి నేర్పటం యిత్యాది నిత్యకృత్యాలతో, అతని జీవితం గడుస్తూండేది. చెప్పవచ్చిం దేమిటంటే యితనికీ, షావుకారుగారికీ చుక్కెదురు.

కారణాలు లేకపోలేదనుకోండి.

చెలమయ్య అన్నగారిని యెపుడో ఒకటి రెండుసార్లు కుక్క కరిచిందట. ఓనాడు అల్లా కరిచిన ఒక కుక్కని, చెలమయ్యచేతిక్రిందవున్న కుర్రాళ్ళంతా బాణాకర్రలు పట్టుకుని, వాళ్ళ రాళ్ళపాలెంనుంచి తరుము కొచ్చారుట. ఆ కుక్క బస్తీవేపు పట్టించింది. తిన్నగా రథాంగపాణిగారి సావిట్లోకి పరుగెట్టింది. అది ఒకకోటే దానికి. అసలు రథాంగపాణిగారి సావిడి—ఊళ్ళో కుక్కలకి ఆశ్రయంలెండి. ఈ మునిసిపాలిటీబండి వస్తుంది చూడండి—కుక్కల్ని పట్టుకుని చంపెయ్యడానికి—ఆ బండిని యెంతదూరాన చూసినాసరే, వాడ వాడకుక్కలూ వొక్కపరుగున ఆయన చావిట్లోకి వచ్చిపడేవి. ఆ సమయంలో ఆయన సాక్షాత్తూ శిబి చక్రవర్తే. మునిసిపాలిటీవాళ్ళని హడలెత్తించేవారు. మంచనండి, చెడ్డనండి ఆయనకి యిదొక వెర్రి. సరి, ఇహ యీ యువకసైన్యం అంత క్రితం యెవరెవర్నో కరిచిన కుక్క లన్నిటిమీదావున్న కక్షంతా, ఈ కుక్కని చంపి తీర్చుకుందామన్నట్టుగా అక్కడికి వచ్చిపడ్డారు. కాని, అది సాగలేదు. రథాంగాపాణిగారు మరొకసారి దోషి అయ్యారు—చలమయ్యదృష్టిలో; తద్వారా యువకులదృష్టిలోనూ.

ఆ యేడు దీపావళి వచ్చింది. ఏదో ఆనాడు దానవత్వం అడుగంటి దైవత్వం వృద్ధిలో వుంటుంది అని పెద్ద లంటారుగదా—సూత్రప్రాయంగానో యెల్లాగో—ఒక్కొక్కసారి పరిస్థితులు యెదురుతిరుగుతాయి. చూస్తూనే వుంటాంగదా.

ప్రక్కింటివారు బాణసంచా చేసుకుంటున్నారని షావుకారుగారి అబ్బాయి పోరెట్టేడు. అందుకని ఆయన బాణసంచా యింట్లో కట్టిస్తు న్నాడు. సరదాగా ఓ నాడు ఆయనే కట్టడానికి ఆరంభించాడు. గ్రహచారం బాగుండకపోతే కర్ర పాము కరిచిందని ఆ మందుసామాను కాస్తా తన చేతిలో పేలిపోయింది. ప్రక్కనేవున్న తన ఒక్కకుమారుడూ పోయాడు. వెంటనే ఆయన్ని ఆస్పత్రిలో చేర్చాం.

"వీడి పిసినిగొట్టుతనం అధ్వాన్నం గాను!" అంది లోకం.

రథాంగపాణిగారికి రెండు ముంజేతులూ పనికిరాకుండాపోయాయి. వంగవు, ఉపయోగంలేవు. అల్లాగే కొయ్యబారిన చేతులతో తిరిగి తన తలవాకిలి యెక్కారు.

యోగులైనా, భోగులైనా వాళ్ళ వాళ్ళ కర్మానుసారంగా జీవిత యాత్ర గడపవలసిందేగదా నాయనా. ఆయన అల్లాగే 'మొండిగా' బ్రతుకుతూవచ్చారు.

ఇహ అది మొదలయ్యా-కుటుంబం క్షీణించడానికి. వ్యాపారం మారుమొహం పెట్టింది. ఎల్లాపోయిందో కర్పూరంలా ఆరిపోతూవచ్చింది ఆస్తి. తిరిగి పుంజుకోడానికి భగీరథప్రయత్నాలు చేశారు. ఊఁహూ. లాభంలేకపోయింది. బంధువర్గమా అంటే—"ఏనుగ పడితే ఏనుగే లేవాలి గాని—"అన్నారు. ఇక నిల్చినవల్లా పల్లెటూళ్ళలోవున్న వడ్డీ వ్యాపారాలే-అదైనా కొద్ది కొద్ది మొత్తాలే.

ఆ వేసవికి యెండలు మరీ విపరీతమైనాయి. బీళ్ళల్లో యెండలు పరిగెట్టేవి. విధిలేక పగలు కాలినడకను ప్రయాణంచేసేవాళ్ళు యెంతో మంది శోషవచ్చి పడిపోయేవారు. ఒకళ్ళిద్దరు పోయారుకూడాను— మధ్యదార్లలో మంచినీళ్ళ కల్లాడుతూ.

ఉన్నట్టెవుండి రథాంగపాణిగారు "రెండు చలివేంద్రాలు కట్టించండి సుబ్బన్నగారూ" అన్నారు నాతో.

నా కుమారుడూ, నేనూ ఆ చలివేంద్రాలు చూస్తూవచ్చాం. మాకూ భత్యాలు యేర్పాటుచేశా రనుకోండి. ఎందుకుచెబుతారు—రాత్రి తెల్లవార్లూ రెండుమైళ్లూ వెళ్ళి, కావిళ్ళతో నీళ్ళు చేరవేసేవాళ్ళం, మా అబ్బాయీ, నేనున్నూ. పగలంతా వచ్చేపోయే బాటసార్లుకి లోటాలతో ఆ నీళ్ళు పొయ్యడం—అదీ మా పని వేసవి వెళ్ళేవరకూ.

అంటే వూరికే నీళ్ళు పోసేవాళ్ళంగాదులెండి. గిద్దెడునీళ్ళూ కానీకి అమ్ముతున్నారు రథాంగపాణిగారు.

ప్రాణం శోషొస్తూంటే కానీ యివ్వక తప్పుతుందా, మంచినీళ్ళకి. అల్లాగే కొనుక్కుని త్రాగేవారు, జనం.

"చెయ్యీ, కాలూ తిన్నగా వున్నన్నాళ్లూ, వడ్డీలకి వడ్డీలుకట్టి కొంపలార్పేది చాల్లేదయ్యా ? ప్రాణాలు చేతపట్టుకుని గుక్కెడు మంచినీళ్ళడిగితే కానిడబ్బుకిగాని పొయ్యరట. భగవంతు డిచ్చిన నీళ్లుకూడా అమ్ముకుంటున్నాడయ్యా, పాపాత్ముడు" అన్నాడు చలమయ్య, పెద్దల యెదురుంగా.

"ఈ డబ్బు నిల్చేనా ?" అన్నారు పెద్దలు.

"ఏం కట్టుకుపోతాడు ?" అన్నారు విన్నవాళ్ళు.

చుట్టూ గ్రామాలవాళ్ళూ, వెయ్యినోళ్ళా ఆయన్ను పెట్టని శాపనార్థాలు లేవు.

షావుకారుగారు యివన్నీ పెడచెవిని పెట్టారు. సంవత్సరాలు తిరుగుతుండేవి. ప్రతి చైత్ర వైశాఖాల్లోనూ, మా మంచినీళ్ళవ్యాపారం మహా వుధృతంగా సాగుతూనేవుండేది. ఇచ్చేశక్తి లేనివాళ్ల అడిగినా

యివ్వలేరు, ఉన్నవాళ్ళవద్ద గోళ్లూడగొట్టి వసూళ్లు చెయ్యమన్నారు మమ్మల్ని.

పైగా, ఆయన హుకుంమీదనే, రాను రాను టసార్ల హుండా తనాన్నిబట్టీ చేతిలో పైకాన్నిబట్టీ—గిద్దెడునీళ్లూ కానీనుంచి ఒక అణా, రెండణాలుకూడా అయ్యేవి. అంటే, బస్తీనుంచి ధాన్యంఅదీ అమ్మి తిరిగి వస్తూంటారు చూడండి—వాళ్ళవద్ద కాసులు మెదులుతుండేవి—వాళ్ళకోధర మంచినీళ్లు.

అల్లా తిరిగి వస్తూంటేనేగా చలమయ్య అన్నగార్కి అల్లా అయింది. ఆవేళ, ఆ యేడాదికి చలివేంద్రాలు యిక యెత్తేస్తున్నాం. మావాడూ, నేనూ కాగులన్నీ కడుగుతున్నాం. చలివేంద్రంబైట అంతా నీళ్లు మడుగుగా వున్నాయి. చలివెంద్రాలదగ్గర బండ్లు ఆపారు. ఎప్పటి లాగు ఆ గుంపులోవున్న చలమయ్య అన్నగారు ఆ నీళ్లు చూడంగానే పిచ్చికుక్కల్లే వెర్రికేకలెయ్యడం మొదలెట్టాడు. అతన్ని లోగడ కుక్క కరిచింది చూడండి. వాట్లల్లో దేనికైనా పిచ్చిచిహ్నాలు వుండివుంటే, ఆ కాటుతిన్న మనిషికి అది లోపలే యెక్కువౌతూంటుందాయె. ఎప్పుడో ఒకసారి ప్రకోపించక మానదు. అది యెల్లాగూ ప్రాణానికి ముప్పే. అంతవరకూ వచ్చాక బ్రతకనివ్వదుగదా. దాహంమీదట నీళ్లుచూస్తే వెంటనే యెక్కువౌతుంది—పోతారుకూడాను.

సరి, ఇక చెప్పేదేముంది. అన్నగారుకాస్తా పోవడం చలమయ్యకి అగ్నిలో ఆజ్యంపోసినట్టయింది.

"ఆ దిక్కుమాలిన చలివేంద్రాలు అక్కడ చావకపోతే, మా అన్న కంట్లో ఆ నీళ్లు పడవుగదా. ఈ రత్తంగపాణియ్య ఆఖరికి మా అన్ననికూడా మింగేశాడయ్యాబాబూ" అని యేడ్చాడు.

ఈ ప్రచారంలో వూళ్ళో సగంమందికి పైగా చలమయ్య ప్రక్కనే చేరారు. అందరూ కొద్దో గొప్పో షావుకారుగారికి బాకీ వున్నవాళ్లేగా.

అందులో చలమయ్యకూడా ఋణాన్నపడ్డవాడేనాయె. ఇల్లూ, వాకిలీ రథాంగపాణిదగ్గరే తనఖా వుందిగదా.

అతనికేగాదు, ఆ చుట్టుపట్ల అందరికీ అల్లాగే గడవడం కష్టం అయిపోయింది. మరీ ఆ మరుసంవత్సరం బీదా-సాదా ఆకళ్ళతో మాడారు. ఆ మంటకొద్దీ అక్కడక్కడా పల్లాల్లోవున్న యెండిపోయిన జమ్ము అంతటికీ నిప్పంటించారు. ఎర్రగా ఆకాశంయెత్తున మంటలు లేచినాయి—అన్నట్టు నువ్వు చూచివుంటావు, ఆ మంటలకి ఆ సుమారున పైన మబ్బులుకూడా యెర్రబారిపోయాయి. అటూ యిటూ కొన్నిమైళ్ల ఆ యెర్రటిబబ్బులు కనబడ్డాయి. రథాంగపాణీగారు బస్తీలో తన మేడ మీదినుంచి చూశారు. జనం వాడుకోడానికి, గొడ్లు త్రాగడానికి వున్న ఆ వొక్కమడుగులోని నీళ్ళతోనూ కూలీలనుపెట్టి ఆర్పించడానికి ప్రయత్నించారు.

జనం దుబ్బులికి నిప్పంటించడం యెందుకో తెలుసా ? అగ్ని వేడికి తట్టుకోలేక జమ్ముల మొదళ్ళలో తలదాచుకున్న తాబేళ్లూ అవ్వీ బయటికి పారిపోయివస్తాయి. వాటిని పట్టి అమ్ముతారు. అది జీవనోపాధి.

రథాంగపాణిగారు ఆ మంట లార్పించబోయేవరకూ యీ జనానికి కడుపులు భగ్గుమన్నాయి.

"అదిగో మా నోటిదగ్గరకూడు తీశాడురా" అని కొందరూ, "ఇప్పుడు హరహరా అన్నా ఒక్క నీటిబొట్టు అందుబాట్లో లేదుగదా !" అని మరికొందరూ, "అమ్మ పెట్టాపెట్టదు, అడుక్కు తిననివ్వదు" అని యింకాకొందరు అనేశారు.

"తాగే నీళ్ళమ్మి డబ్బు గడించే కటిక పాపాత్ముణ్ణి కలియుగం కనుక మోస్తావుంది" అన్నాడు చలమయ్య.

దానికి మరుసటివేసవిలో, ఆ ప్రాంతమంతా యే పుణ్యాత్ములో బావులుత్రవ్వించడం ఆరంభించారు. ఒక పెద్ద చెరువుకూడా త్రవ్విస్తు

న్నారు. ఉప్పర మంగన్న ముఠావాళ్ళంతా మంటగాడ్పుల్లో చెమటోడ్చి మరీ త్రవ్వుతున్నారు. మంగన్న యీ ధర్మకార్యాలన్నీ కంట్రాక్టుపుచ్చుకుని చేయిస్తున్నాడు. చుట్టుపట్లంతా పుకారుపుట్టింది.

జనం అందరికీ పండగచేసుకున్నట్టుగా అనిపించింది. రథాంగపాణిగారి ఆటలిక సాగవు. ఇన్నాళ్లూ ఆడిందాట, పాడింది పాటాను. ఈయేటినుంచి ఆ పాపపు సంపాదన ఆగిపోవాల్సిందే. వీలుంటే రెండేసి పంటలు పండించుతాం. ఇంక యీ రత్తయ్యదగ్గర అప్పులకి పోతామా, సప్పులకి పోతామా అనుకున్నా రందరు.

ఇక ఆ నెలలో చలమయ్య రథాంగపాణీగారివద్ద తీసిన అప్పుకి కోర్టు రోజులు దగ్గర బడ్డాయి.

చెరువులు తవ్వించే ధర్మాత్ముల చెయ్యి భారీగా పోతుంది. ఒక సత్రంకూడా కట్టించారు. అక్కడక్కడా చెట్లుకూడా పాతారు. ఇప్పుడు రథాంగపాణి గారిని బాహాటంగానే తిట్టడం మొదలెట్టారు జనం. ఈ విధంగా గంగ తొణికిసలాడుతూంటే యీ పాపిదగ్గర మంచినీళ్లు యెవరు కొంటారయ్యా. అతని అవసరం మనకేమిటి—అని మురిసిపోయారు.

చలమయ్య యావత్తు ఆస్తీ వేలంవేయడానికి కోర్టు నిశ్చయించింది. వేలం రోజులు దగ్గర బడ్డాయి.

"చీమాదోమా పిల్లలతో యెవ్వరిపంచ నుంటాడు పాపం. ఈ రత్తయ్య మనిషేనా అంట ?" అన్నారు ఇరుగు పొరుగు వాళ్లంతా.

"ఉన్న కాస్త కొండ్రానీ ఇకమీదట రెండు పంటలు పండించుకు బ్రతుకుదామని ఆశపడ్డాను. పిల్లలనోటికాడ కూడు తీసి వేలంవేస్తున్నాడు. ఉండడానికి నీడే లేపోతే, ఇంకేం పండిస్తాను," అన్నాడు ఉసూరు మంటూ ఊరువాళ్లతో.

"పుట్టేవాళ్ల పురుళ్లా, పెరిగేవాళ్ల పెళ్లిళ్లా? అందుకేగా కొడుకూ కొమ్మా లేకుండా పోయారు." అన్నారు అమ్మలక్కలు.

"నా అనేవాళ్లు లేరుగదా, తన తదనంతరం ఇల్లా దీపాలార్పేసి గడించినది ఎవ్వరికి పెడతాడూ అంట" అన్నారు మునసబుగారు.

"ఆఁ! ఎవ్వరికి పెట్టేదేముంది. ధనాపేక్ష. డబ్బుచేదా?" అన్నారు కర్ణంగారు.

"ఆఁ! ఏం కట్టుకుపోతాడు లెగుండి" అన్నాడు ఊరువెట్టి.

"అరెరే, ఎక్కిరిచ్చబోయి ఎల్లకిలా బడ్డాడురా. కఱ్ఱసాము, కత్తిసామూ నేర్చిన చలమయ్యగారు చివరకి మొండాడి చేతుల్లో ఇరుక్కుపోయాడే" అని ఎగతాళి చేశారు, తాళింఖానాలో చేరని కుఱ్ఱాళ్ళంత.

"ఇక వీడు ఉంటే ఏం, చస్తే ఏం? ఇకమీదట ఈడి పెట్టుబళ్లో వదు[illegible]పపు నీళ్ళు వద్దుగందా. దేశం అంతా పచ్చగా ఉంటాది గందా! ఈడి దాచిన్నం ఎందుకురా మనకి" అన్నారు తాళింఖానాలో జనాభా.

"చూత్తా రేంటి. రేపు పొద్దున్న ఎవ్వాళ గత్తైనా అంతేగందా!" అన్నారు బాకీ ఉన్న వాళ్ళంతా.

ఊళ్ళోపార్టీలు పడ్డాయి. గుంపులు గుంపులుగా చేరి ఆలోచించారు. ద్వేషాలు శ్రుతి మించాయి.

తాళింఖానాలో యువకు లందరూ ఉత్తర ప్రజ్ఞలు కొట్టారు. వేలం రోజులు మరీ దగ్గరసా వచ్చేశాయి. ద్వేషాలు విషమించాయి.

శేషమ్మగారి ఆదరణలో వున్న వెఱ్ఱిగంగి కనిపించినప్పుడల్లా పిల్లలు రాళ్లువేశారు.

అబ్బాయిలూ, అట్టే ఆలోచిస్తూంటాను ఒక్కొక్కప్పుడు. బూదేవికి సమీపంలో బ్రతికేవాళ్లకి రాగద్వేషాలు అపరిమిత మేమో అనిపిస్తుంది.

సరి, ఆలోచనలకేంగాని, ఉప్పర మంగన్నముఠా ప్రవ్వకంపనులు ముగింపు కొచ్చాయి. నేడో రేపో సంపూర్తి అయిపోతాయి. రథాంగ పాణిగారి చలివేంద్రాలూ, వడ్డీవ్యాపారం కూడా పడిపోయి నట్టే, నిశ్చయం.

ఆనాడు నిండు అమావాస్య. మంచి పుధృతంలోవుంది, తాళింఖానా అంతా. చేతుల్లో కర్రలూ, మెలితిరిగిన దండలూ, కొంచెం మైకంగా కూడా వున్నారు. ఆవేశాలకి అంతులేకపోయింది.

రథాంగపాణిగారిని యిహ చంపెయ్యడానికి నిశ్చయించారు, ఆవేళ. నిదానంమీద మళ్ళా ఆయన యింటికి నిప్పెడదామని తోచింది. సరి, చలమయ్య నాయకత్వం వహించాడు. రథాంగపాణి రాక్షసుడియిల్లు కాలిపోతే తద్వారా, ఆ ఒక్కప్రాణీ విరగడైతే యెంతమంది సుఖపడతారు! ఎంతమంది యిళ్ళూ వాకిళ్ళూ చల్లగుంటాయి!

అక్షయపాత్రకవెళ్ళి పల్లెనించీ, తాళింఖానా ప్రక్కగా వస్తున్న వెర్రిగంగి యీ యేర్పాట్లన్నీ అప్రయత్నంగా వింది. ఇక అది గోడల ప్రక్కగా క్రీడల్ని ప్రాకి ప్రాకి, తరువాత అడ్డత్రోవని చెవికల కడ్డంబడి ఒక్క పరుగున బస్తీలో కొచ్చిపడ్డది.

ఆనాటి దృశ్యాలన్నీ యీనాడు నాకు కళ్ళకి కట్టినట్టే వున్నాయి ఇంకాను. ఆవేళ రథాంగపాణిగారితో నేనూ వున్నాను, వారి యింట్లో. పద్దులు చూస్తున్నాను. రాత్రి భోజనా లయిపోయినాయి.

అసలు వాళ్ళనుకున్నదేమిటటా—కొంతమంది కిరసనాయిలుబుడ్డి, అగ్గిపెట్టి పట్టుకుని, రథాంగపాణిగారి లోగిలి వెనకవేపు కాచుకుని

ఉండేటట్టూ, చలమయ్య ముందరి వీధితలుపు గొళ్లెంపెట్టేటట్టూ — తలుపులు తీసుకుని లోపలినించి ఆయన పారిపోకుండానూ, ఆ తరువాత కొంపకి నిప్పెట్టేట్టూను.

అబ్బాయిలూ! ఇహనేం చెప్పమంటారు, ఆ ఘట్టం వినండి. లోపలవున్న మాకు ఒక బండరాతితో తలుపు యెవ్వరో గుద్దుతున్నట్టు చప్పుడు వినిపించిందండి. ఎవ్వరై ఉంటారా అని అందరం తటపటాయించాము. ఊరునిండా విరోధులు. తలుపు తియ్యవద్దని నిశ్చయించాం.

మేమింకా నిద్రలో ఉన్నాం. లేవాలి అని గంగి ఉద్దేశం గొంతెత్తి మమ్మల్ని పిలిస్తే, వెనక వస్తున్న తాగినమూక దాని తలకాయ బద్దలు కొడతారాయె. ఇంకేమి చెబుతుంది మాకది. దానికా చేతులు లేవాయె. అందుకని తలకాయతో, తలా తలుపులూ బద్దలయేలా కొడుతూంది. మాకా సంగతి తెలియదుగా. దాని తలకాయ చిల్లుపడుతూందిగాని, మేము మాత్రం ససేమి పలకంగా. లోపల కుక్కిన పేనుల్లా గప్ చిప్. అదల్లా కొడుతూనే ఉంది.

ఆఖరుకి, "భగవంతుడున్నాడు. ఒకళ్ళకి నలుగురం ఉన్నాం మనం. తలుపులు తీద్దాం" అన్నాడు రథాంగపాణీగారు.

నేనూ, నా వెనక ఇంట్లో అందరూ. తలుపు తీశాంగదా, గంగి మొదలు నరికేసిన చెట్టల్లే మా కాళ్ళ ముందర లోపలికి పడిపోయింది — గాభరాగా. అందరమూ ఆశ్చర్యంతో గుమ్మంలోకి మూగాం.

మా ముందర, గొళ్లెం వేయడానికి అప్పుడే వచ్చిన చలమయ్య కంటబడకుండ పారిపోలేకపోయాడు. అల్లాగే గుమ్మంలో విగ్రహంలా నిలబడిపోయాడు.

ఒక్క క్షణంలో తెప్పరిల్లి "నువ్వేందు కున్నావు, ఈ వేళప్పు డిక్కడ ?" అని మా ప్రక్కనున్న మంగన్న నడిగాడు చలమయ్య ఆశ్చర్యంగా.

"డబ్బుకోసం వచ్చాను, ఇంకెందుకు" అన్నాడతను.

"నీకేం పోయేకాలం వీడిదగ్గర అప్పు చెయ్యడానికీ ? ఆ కాంట్రాక్టుల్లో ఏమీ మిగల్లేదా ? అంతా చేతిచమురు భాగోతమేనా ?" అన్నాడు తిరిగి చలమయ్య.

"అదేంలేదులే రేపోమాపో మా పనులు తీరిపోతాయి, కాంట్రాక్టు డబ్బు అంతా, నాకు మొదటే ఇవ్వలే. ఇయ్యేల పైసలుగా ఇచ్చేత్తా నన్నారు, అందుకొచ్చా. లెక్కలు చూసుకుంటున్నాం" అన్నాడు మంగన్న.

చలమయ్య అల్లాగే నిశ్చేష్టితుడైపోయాడు, మాట గొంతులో నించి పెగుల్చుకొచ్చింది ఈసారి. "అయితే నువ్వు తవ్వే చెరువులు, నూతులూ గట్రా ఎవ్వరి ధర్మం?" అన్నాడు,

"ఇం కెవ్వళ్ళయ్య. రత్తంగపాణియ్యగారి యేగా ఇయ్యన్నీ. నాతో ఎన్నో ఏళ్ళనించీ రహస్యంగా చెప్తానే ఉండాడు. ఈ యేడు గాని పనిసాగలే." అన్నాడు మంగన్న.

చలమయ్య నోటమాట రాలేదు. "పైగా, పరుగునేల కొాక నిలుపుడెత్తు రాయిసొప్పున పాతమన్నాడు, గొడ్డూ గట్రా ఈపులయ్యా గోక్కోటానికి. అనుకున్న దానికంటే, ఎక్కువే అయింది నాకు కూడా. ఏ మెక్కువయినా అనుక్కున్న మాటకి ఎనకంజె యేసే మనిషి కాదు గనక సరిపోయింది." అన్నాడు మళ్ళా మంగన్న.

అమ్మవారి గుళ్ళు చూస్తే దూరంగా తప్పించుకు తిరిగే చలమయ్య చేతులు జోడించాడు — అట్టే చూస్తూ నిదానంగా, గుమ్మం దీపం వెలుగులో, అతని కళ్ళల్లో నీళ్ళు మెరిశాయి ....

*     *     *     *     *

నన్నూ నా కుటుంబాన్ని కూడా, రథాంగపాణిగారు పిలులునా మాలో మర్చిపోలే దనుకోండి. ఈ సత్రం ఆయన కట్టించిందే. ఆఖరుకి గంగినికూడా మర్చిపోలేదు ఆయన.

అదిగో పాపం, గంగి కదులుతూంది. అమ్మాయిలూ, ఇక దాన్ని లేపెయ్యండి. ఒకపాట పాడుతుంది, అబ్బాయిలు వింటారు.

*     *     *     *     *

చేతిలో పని. ఉలి సుత్తి ఉన్నాయి. ఈ కొయ్యవిగ్రహం చలమయ్య చేసిందే — రథాంగపాణి గారిది.

* * *